# రాజీ

## కొమ్మూరి వేణుగోపాలరావు

రైల్లోంచి దిగి రిక్షాలో సామాన్లతో కూడా శరీరాన్ని చేరవేసిం తర్వాత ఒకసారి బరువుగా ఊపిరి పీల్చుకుని, అక్కగారు రాసిన ఉత్తరాన్ని ఒకసారి పునశ్చరణచేసుకున్నాడు గంగాధరం.

తమ్ముడూ !

నువ్వోసారి అర్జంటుగా బయల్దేరి రావాలి. ఇక్కడ నీ మేనల్లుళ్ళిద్దరికీ బొత్తిగా పడకుండావుంది. ఇంటిని రెండు భాగాలు చేసేశారు. ఇద్దరికీ మధ్య పచ్చ గడ్డివేస్తే భగ్గుమంటూవుంది. ఈ వృద్ధాప్యంలో నాకు కొడుకులిద్దరి దెబ్బలాటలూ చూడవల్సివచ్చినందుకు కుమిలిపోతున్నాను. నీమాటంటే వాళ్ళకు గౌరవముంది. ఎలాగో నువ్వేవచ్చి రాజీ కుదిర్చిపెట్టాలి. నీ అక్క. 'రాజమ్మ'.

రిక్షా గతుకులోపడ్డ కుదుపుకి ఒకసారి అటూయిటూ కదలాల్సివచ్చిన గంగాధరం మెల్లిగా నవ్వుకున్నాడు. పిచ్చికుంకలు. అన్నదమ్ముల మధ్య ఎందుకో యీపోట్లాటలు.

మరుక్షణంలోనే మీసాలచాటున మిణుకుమన్న అతని నవ్వు అంతరించిపోయింది. ముఖలక్షణాలన్నీ చటుక్కున విచారసూచకంగా మారిపోయాయి.

"అయినా వీళ్ళకిదేం బుద్ధి? ఒక్కొక్కళ్ళకీ పాతికేళ్ళొచ్చి!"

అక్కయ్య తనమీద యీభారం మోపింది. ఆవిడంటే తనకు గౌరవం, అభిమానం, ప్రేమ. చిన్నప్పట్నుంచీ అదే అలవాటు. కంటతడిపెడితే చూసి సంతోషించలేదు. అటువంటిది ఆవిడ యీ పెద్ద వయస్సులో కొడుకుల తగాదాలవల్ల దుఃఖపడుతున్నదంటే...!

అసలెందుకు వచ్చివుంటుందీ దుమ్ములాట? తన దృష్టిలో యిద్దరూ మంచివాళ్ళే. చంద్రంకన్నా రెండేళ్ళు పెద్దవాడయిన దుర్గ్వినియోగం చేసుకోటానికి ఎప్పుడూ ప్రయత్నించలేదు. అలానే చంద్రంకూడా తన చిన్నతనపు దురుసుతనాన్ని ప్రదర్శించలేదు నాలుగేళ్ళక్రితం బావ చనిపోయినప్పట్నుంచీ యిద్దరూ సఖ్యతగానే మెలుగుకుంటూ వస్తున్నారు ఇంతలో ఎలా పుట్టిందో యీబుద్ధి ?

బహుశా దీనికి కారణం ఆడవాళ్ళే అయివుంటారు. సందేహంలేదు. మొదట్లో వాడిపెళ్ళాం వీడిపెళ్ళాం కొట్లాడుకుని వుంటారు. అదే పెద్దదై వీళ్ళవరకూ పాకివుంటుంది. ఇంకేం ?

అంతా తెలిసిపోయినట్లు అనిపించింది గంగాధరానికి.

తను యీతగువు తీర్చాలి !

బరువుగా ఊపిరి పీల్చుకున్నాడు. కష్టమే! అయినా తప్పనిసరి!

తన శక్తిమీద తనకు నమ్మకంవుంది. తన మాటంటే వాళ్ళకు ఎంత గౌరవంవుందో తనకు తెలుసు. తను అక్కడికి చేరగానే ఎంత ఆదరిస్తారో తెలుసు. ఎట్లా యీ విషయాన్ని పరిష్కరించటం? తనంటే గౌరవం వున్నంతమాత్రంచేత ఒకళ్ళంటే ఒకళ్ళు మండిపడుతూన్న యిద్దరూ దగ్గరకు చేరుకుంటారా? అపనమ్మకం పుట్టింది. కష్టమే.

గంగాధరం యింకా ఆలోచించుకుంటూవున్నాడు. రిక్షా పోయిపోయి ఒక పెద్ద పెంకుటింటిముందు ఆగింది.

అతను ఆలోచనల్లోంచి రిక్షా దిగి, వాడికి డబ్బులిచ్చి పంపేశాడు. చేతిలో సంచీతో సహా గేటుదాటి లోపలకు అటు ఒకభాగం; యిటు ఒక భాగం. మధ్య ఒక తడికకట్టవుంది. సందిగ్ధంగా నిలబడిపోయాడు. ముందు ఏ భాగంలోకి పోవాలి?

కొంతసేపటిదాకా ఎవరూ కనబడలేదు. తర్వాత అతను చొరవచేసి రెండడుగులు వేసేలోపలే "తమ్ముడూ" అంటూ కుడివైపు యింట్లోంచి దూసుకు వచ్చింది రాజమ్మ.

అక్కగారి ముఖంవంక పరిశీలించి చూశాడు గంగాధరం. పీక్కుపోయివున్న ఆ ముఖమూ, గుంటలుపడ్డ ఆ కళ్ళూ, తైల సంస్కారంలేని నెరిసిపోయిన ఆజుట్టూ... అతనికళ్ళు చెమ్మగిల్లాయి; మూర్తీభవించిన శోకదేవతలా వుంది.

"అక్కయ్యా." అన్నాడు చిన్నపిల్లాడిలాగా.

"వస్తావే చూశావుగా పరిస్థితి ఎట్లావుందో? లోపలికి రా చెబుతాను" కళ్ళు తుడుచుకుని "రా" అంది మళ్ళీ. అతను మెల్లగా ఆమెను అనుసరించాడు. గుమ్మందాటుతూ "యిది ఎవరి భాగం?" అని ప్రశ్నించాడు.

"ఇందులో శంకరం వు[illegible]న్నాడు. కూర్చో" కుర్చీచూపించింది. గంగాధరం చేతిలో సంచీ గోడకు ఆనించి కుర్చీలో చేరగిలబడ్డాడు.

"మంచినీళ్ళు తీసుకురానా?"

"ఊఁ"

రాజమ్మ లోపలకు వెళ్ళింది. ఇంటిలోని ఆ సగభాగాన్నీ నలువైపులా చూశాడు గంగాధరం.

రెండు నిమిషాలు గడిచేటప్పటికల్లా మంచినీళ్ళ గ్లాసుతో రాజమ్మ వచ్చింది.

"శంకరం లేడా?" గ్లాసు క్రింద పెడుతూ అడిగాడు.

"ఆఫీసునుంచి యింకా రాలేదు."

"కోడలు?"

"అదేమిటి? ఎందుకూ?" ఆశ్చర్యంతో ముందుకు వంగాడు

రాజమ్మ తలుపు కానుకుని నిల్చుని తాపీగా అన్నది "చిన్నదీ, యిదీ జుట్టూ జుట్టూ పట్టుకున్నారు కోపం తీరక పుట్టింటికి వెళ్ళిపోయింది"

గంగాధరం మనస్సులో హాయి కలిగించే తరంగాలు చెలరేగాయి అయితే తను అనుకున్నది నిజమే నన్నమాట!

"శంకరం వ్రాయకున్నాడా?"

"ఎందుకూరుకుంటాడు? చంద్రంతో దెబ్బలాడి విడిపోయాడు రేపో ఎల్లుండో పోయి దాన్ని కూడా తెచ్చుకుందా మనుకుంటున్నాడు తిరిగి"

గంగాధరం ఒకసారి నిట్టూర్చి "అయితే ఆపె వాళ్ళిద్దరికీ తగాదా ఎందుకు వచ్చినట్లు?

రాజమ్మ ఏదో చెప్పబోయి ఆగిపోయింది బహుశా దుఃఖం అనేది ఆమె గొంతులో అడ్డుపడివుంటుంది కాని ఎలాగో ఆ దుఃఖం మింగివేసి చెప్పింది

"ఏముంటుందీ? నేనామధ్య జ్వరంవచ్చి మూడురోజులు మంచం ఎక్కే సరికీ అన్నం వండే విషయంలో వచ్చింది తగాదా సరిగ్గా వండటం యిద్దరికీ చేతకాదు ఆమెవంటలో ఉప్పు తక్కువయిందని యీవిడగారూ, యీవిడగారి వంటలో కారం తక్కువయిందని ఆమే, యిద్దరూ సాధింపులు మొదలు పెట్టుకున్నారు ఒకరోజు మాటా మాటా పెరిగి చేతుల్లోకి దిగింది. అంతే అక్కడ్నుంచీ ఆ దంపతులకీ యీదంపతులకీ మధ్య వైరుధ్యాలూ, వైషమ్యాలూ పెరిగిపోయాయి" రాజమ్మ గుక్క తిప్పుకుంది

"అంతే?" గంగాధరం ఆశ్చర్యంగా అన్నాడు


"దెబ్బలాటలకు ఎంతకావాలి? అలా పెరిగిపోయి చివరికి ఆ స్తంభం మనసే వరకూ వచ్చింది ఇంటిని మధ్యను విభాగించారు. సామాన్లు పంచేసుకున్నారు నేవద్దని మొత్తుకున్నాను నామాట వినేవాళ్ళెవరు? చివరికి చూస్తూ..కడుపు తరుక్కుపోతూ అలానే వూరుకోవాల్సివచ్చింది." రాజమ్మ వలవలా ఏడ్చేసింది

గంగాధరానికి కష్టం వేసింది కొంచం సేపు వూరుకుని తరువాత "అయితే నువ్వు ఎవరి యింట్లో వుంటున్నావు?" అని అడిగాడు

ఆమె అతికష్టంమీద ఏడుపు ఆపుకుంటూ "నేనెక్కడ వుంటె నేం? కాళ్ళు ముడుచుకొని పడుకు నేందుకు రెండు గజాల చోటుచాలు పెద్ద కోపలు లేరు గదా అని

## అబద్ధమాడని అద్దం!

ఫోటో : డి. రామలింగేశ్వరరావు.



# ★ రాజీ ★

వీడిదగ్గరేవుండి వండిపెడుతున్నాను" అంది.

గంగాధరం ఆలోచనలో నిమగ్నుడై పోయాడు. నిజంగా అక్కగారున్న స్థితిలో వున్న మనిషి, మనశ్శాంతి నశించి...అలా బ్రతకటం కష్టమే.

అతను ఎక్కువసేపు ఆలోచించేక పూర్వమే బయట చెప్పులచప్పుడు వినిపించింది. రాజమ్మ ఉలిక్కిపడి "వాడు వస్తున్నాడు. నేచెప్పానని చెప్పకుసుమా." అని త్వరత్వరగా లోపలకు వెళ్ళిపోయింది. గంగాధరం వెనక్కి వాలుకుని దీర్ఘవిశ్వాసం విడిచాడు.

శంకరం చెప్పులు ముందు గదిలోవిడిచి, లోపలకువస్తూ అతన్ని చూసి "అరె ఏమిటి మామయ్యా ఎప్పుడూ రావటం?" అని అడిగాడు తనుకూడా ఎదురుగుండా కూర్చుంటూ.

"ఇప్పుడేరా. అంతావచ్చి పదినిమిషాలు కాలేదు."

"ఏమిటి విశేషాలు? ఏమన్నా పనిమీదనా?"

"ఊఁ. లేకపోతే ... సరదాగా తిరగటానికి యీ వయస్సులో..." అంటూ నవ్వేశాడు గంగాధరం.

"అంతేలే. మాయింటికి యధాలాపంగా చూసిపోయేందుకు నువ్వెందుకు వస్తావు?"

"ఏమన్నా చూసేటట్లుంటేనా మీ యిల్లు?" అనేశాడు చప్పున గంగాధరం.

శంకరం అతనివంక ఒకసారి దీర్ఘంగా చూసి "తర్వాత మాట్లాడుకుందాం. భోజనానికిలే." అనేసి వడ్డించమని తల్లిలో చెప్పటానికి లోపలకు పోయాడు.

భోజనాలుచేస్తున్నంతసేపూ గంగాధరం ఆప్రసక్తి ఏం తీసుకురాలేదు. 'భోజనాలు చేశాకే మాట్లాడుకోవచ్చులే. తొందరేముంది?' అనుకున్నాడు. శంకరం అంతకన్నా ఆవిషయం ఎత్తలేదు.

భోజనాలుచేశాక తడికకు యిటువైపు కుర్చీలువేసుకుని వక్కపొడి నముల్తూ కూర్చున్నారు యిద్దరూ.

ఉన్నట్టుండి గంగాధరమే కదిపాడు "ఏమిట్రా శంకరం యిదంతా?"

శంకరంకూడా తుళ్ళిపడి "ఏమిటి మామయ్యా?" అన్నాడు.

"ఏమీ తెలియనట్లు నంగనాచిలా అడుగుతావేం? ఇదంతా చూశాకకూడా నేనా మాత్రం వూహించుకోలేననుకున్నావా?"

శంకరం తలవంచుకున్నాడు. "అయితే నీకంతా తెలిసినట్లుంది. దాన్ని గురించి యింకాతర్కవితర్కాలు చేసి ఏంలాభం?" అన్నాడు.

గంగాధరం ఆమాట వినిపించుకోకుండా "పెద్దవాడ్ని. మీకంటే చాలా అనుభవజ్ఞుడ్ని. మీరిలా అయిపోతుంటే చూస్తూ ఎలా వూరుకుంటాను?" అన్నాడు మామూలుగా.

అతని ఆంతర్యం గ్రహించటానికి శంకరం ఎక్కువకాలం తీసుకోలేదు. తర్వాత ఎటువైపూ చూడకుండానే "ఎవరెన్ని చెప్పినా రాజీ కుదరటంమాత్రం అసంభవం మామయ్యా" అనేశాడు.

గంగాధరం నోరు తెరిచి ఏదో చెప్పబోయాడు. అంతలోకే గేటుదాటివస్తూ, తన భాగంవైపు వెళ్ళిపోతున్న చంద్రం యితన్ని చూసి ఆగిపోయాడు.

"చంద్రం!" అని పిలిచాడు గంగాధరం.

చంద్రం ఏదో మాట్లాడబోయి, తమాయించుకుని, మళ్ళీ "ఎప్పుడొచ్చావు మామయ్యా? మాట్లాడటం అయిపోయాక మాయింటికిరా" అని వెళ్ళిపోయాడు ఒక నిమిషంవరకూ గంగాధరం స్తబ్ధుడై కూర్చుండిపోయాడు.

తరువాత ఉపక్రమించాడు.

"చూడు శంకరం. మీ అమ్మ ఎంత వృద్ధాప్యంలోవుందో తెలుసుగదా. ఆమె యీస్థితిలో మీయిద్దరి వైరాలూ చూసి ఎంత కుమిలిపోతుందో ఆలోచించుకున్నావా? పెద్దవాడ్ని చెబుతున్నాను. మీయువకుల ఆవేశాలు నాకు తెలుసు. మీలో ప్రవహిస్తున్న ఉడుకురక్తం విచక్షణాజ్ఞానాన్ని నశింపజేస్తుంది. అర్థంలేని బింకాలకిపోయి అన్నదమ్ములే యిలా కొట్లాడుకుంటే, అది చాలా తలవొంపులయిన పనికూడా"

గుక్కతిప్పుకుని శంకరంవంక చూశాడు. అతనిముఖంలో ఏభావం ద్యోతకంకావటం లేదు. కనీసం యీ పెద్దవాడిమాటలు విందామన్న ఆసక్తికూడా అతనిలోవున్నట్లు కనిపించలేదు.

"ఏమంటావు?"

శంకరం తలయెత్తాడు. ఇప్పుడతని ముఖంలో బాధవంటిది స్ఫుటంగా కాకపోయినా, అస్పష్టంగా గోచరిస్తున్నది.

"నువ్వు నన్ను క్షమించాలి మామయ్యా. నువ్వంటే నాకు చాలా గౌరవం వుంది. కాని అనవసరంగా యీ విషయంలో జోక్యంకలిగించుకుంటున్నందుకు బాధగా వుంది నీకు మొదటనే చెప్పాను నేను నిశ్చయించుకున్నదేమిటో చాలా దృఢంగా నిశ్చయించుకున్నాను నా నిశ్చయాన్ని మార్చటంకూడా ఎవరి తరమూ కాదని "

గంగాధరం హతాశుడైపోయాడు శంకరం యీలా అనటం అతనికి చిన్నతనం అనిపించలేదుగాని, తనమాట ఎందుకూ కొరగాకుండాపోతుందే అని బాధపడ్డాడు.

ఈవిషయంలో శంకరాన్ని యింకా వత్తిడిచేయటం సవ్యమైనపనిగా కనిపించలేదు అతనికి. అతనికాసంగతి మాట్లాడటంకూడా అంతగా ఇష్టంలేకపోయింది. కొంతసేపుమౌనంగా, మ్లానంగా గడిచాక "అయితే అమ్మాయి ఎప్పుడొస్తుంది పుట్టింటినుంచి?" అంటూ ధోరణి మార్చేశాడు.

తర్వాత చాలాసేపటిదాకా సంభాషణ సాగిపోయింది. సంభాషణ అంతా ఏవేవో విషయాలమీద జరిగింది. ఒకగంట గడిచాక "నాకు టైమయింది మామయ్యా. ఆరింటికి వస్తాను మళ్ళీ, ఉంటావుగా" అంటూ శంకరం బయటికి వెళ్ళిపోయాడు.

గంగాధరాన్ని పూర్తిగా ఆలోచనలు ఆవరించాయి.

ఈసమస్య పరిష్కారంచేయటం ఎలాగో అతనికి అంతుపట్టలేదు. శంకరం మాటల్లోని నిశ్చలత, దృఢత్వం, ఆత్మవిశ్వాసం తనెందుకూ పనికిరానివాడ్నిగా చేసింది. నీతిబోధలుచేసి అతన్ని మార్చేందుకు వీలులేదని తేలిపోయింది. అయితే యిప్పుడు చేయవలసింది?

అతనికేం తోచలేదు. రాజీ కుదర్చాలంటే యిద్దర్నీ సమాధానపరచాలి. ఆ చంద్రాన్ని సముదాయించినంత మాత్రంచేత ప్రయోజనం ఏముంది? అయినా వాడుమట్టుకు తనమాట వింటాడని నమ్మకం? వీడిలో ప్రవహించే రక్తమే వాడిలోనూ ప్రవహిస్తున్నది. వీడికన్నా వాడేమయినా తక్కువ తిన్నాడా?

అంతే. వాడిదగ్గరకు పోయి యీప్రస్తావన తీసుకురావటం చాలా అసమంజసంగా కనిపిస్తోంది. ఇప్పుడు శంకరంచేత అని

అబలసుధ

స్త్రీ కుసుమ వ్యాధులు, అకాల బహిష్టు, బుతుబద్ధము, బుతుశూల, ఒడలునొప్పులు, తలనొప్పి, గుండెదడ కాళ్ల లాగుట, మనస్థిమితము లేకపోవుట, నిద్రపట్టకుండుట, నడుమునొప్పులు, బలహీనత, మలబద్ధము, హిస్టీరియా మొ॥ హరించును.

సీసా రు. 8/- వి. పి. రు. 1/-

ఇండియన్ మెడికల్ హాల్

లక్ష్మీ టాకీసు రోడ్డు - విజయవాడ-2.

పించుకున్నట్లే వాడిచేతకూడా అనిపించను కోవల్సి వస్తుంది

కర్తవ్యం?

సమాధానం చెప్పుకున్నాడు. స్వయం వచ్చినదారినే వెళ్ళిపోవటం ఉత్తమం. అంతే! అంతే!!

"తమ్ముడూ!"

లోపలినుంచి హీనస్వరం వినిపించింది ఆలోచన్ను త్రెంచుకుని, లేచి లోపలకు వెళ్ళాడు ఆమె యిందాకటిమాదిరిగానే తలుపుకానుకుని నిలబడివుంది.

గంగాధరం ఏదో చెప్పబోయాడు.

"నేనంతా విన్నాను తమ్ముడూ"

అంత పెద్దవాడైవుండికూడా, ఆమె... తన అక్కయ్య యిలా మాట్లాడుతుంటే తనో చిన్నపిల్లాడిలా అయిపోతున్నట్లు అనిపించింది

ఆవిడ యింకా అంటున్నది, "నువ్వు మాట్లకు యింగులో ఏం చేస్తాం వృ? వాళ్ళంతే. వాళ్ళమనసులు మారవు ఇహ నాఅదృష్టం యింతే ననుకుంటాను" కంఠస్వరం రానురానూ సన్నగిల్లి గద్గదంగా మారింది కన్నీళ్ళను కష్టంమీద ఆపుకుంది

గంగాధరం ఆమెవంక విహ్వలదృష్టితో చూస్తున్నాడు అతనిగుండెల్లో ఏదో గిలికినట్లయింది. తను ఎందుకొచ్చాడిక్కడికి? ఆవిడ . తనను ఎందుకు పిల్చింది యిక్కడికి? కాని కాని ... తనేం చేయగలిగాడు?

కొలవకొత్తూ సహజంగా అతనిలో అణగారిపోతున్న పౌరుషం, పట్టుదలా యీ ఆత్మసంఘర్షణతో తిరిగి బయటకి పెల్లుబక సాగాయి తను . అంతటివాడు...అనేక చిక్కు వ్యవహారాలను అవలీలగా పరిష్కరించివేసే సామర్థ్యం తనకుంది...! అంతటివాడు!! ఈ చిన్న సమస్యను పరిష్కారం చేయలేక నిస్పృహతో, నిరాశతో వచ్చిన దారిన వెళ్ళిపోవటమా?

"ఏం చారిస్తున్నావా తమ్ముడూ? ఎందుకూ? ఎవరి కర్మకెవరేం చేస్తారు?... ఆ విషయం మరిచిపో"

తలఎత్తి ఆమెవంక చూశాడు. దిగులుతో బాధతో కళాకాంతులు కోలుపోయిన ఆకళ్ళు...!

"నన్ను కొస్త ఆలోచించుకోనీవమ్మా"

VB. 232



# సారిడన్

ఇప్పుడు ఆరోగ్యరక్షకమైన అభ్రకపు కాగిత ప్యాకింగులో దొరకుతోంది—
కొనుటకు, తీసుకువెళ్లుటకు ఎంతో వీలైనది

ప్రతి 2 అణాల బిళ్ల ఒక పూర్తి మోతాదు—అనేక సమయాల్లో నొప్పిని ఉపశమనము చేయుటకు చాలు.



2 అణాలు

దీనిలో ఆస్పిరిన్ (ఎసిటిల్-సలిసిలిక్ ఆసిడ్) లేదు. మత్తుమందులూ లేవు.

సారిడన్ సత్వరముగ నొప్పిని పోగొట్టును. సౌమ్యముగ ఉత్తేజపరచును. బిగించబడిన నరములకు ఉపశమనము చేకూర్చి మీరు విశ్రమించుటలో సహాకరించును. మీకు నిజంగా నవోత్సాహమిచ్చును. స్త్రీలకు బహిష్టు రోజులలో అది వరప్రసాదము.

సారిడన్ పుచ్చుకొన్న తరువాత ఏ విధమైన అలసట, నిరుత్సాహము కలుగదు. అది మీ కడుపుకు అస్వస్థత కలుగనీయదు. లేక మీకు చెమట పట్టనీయదు. రెండు అణాలకే క్రొత్త అభ్రకపు కాగిత ప్యాకింగులోనున్న ఒక మోతాదు కొనండి.

**సారిడన్** నొప్పిని పోగొట్టి మీకు నవోత్సాహము నిచ్చును

10 బిళ్లలుగల సుపరిచితమైన చిన్న ట్యూబులలోకూడ, తగ్గించిన ధరకు దొరకును.

# ★ రాజీ ★

అంటూ లేచాడు చప్పున. సావిట్లోకి వచ్చి యీజీఛైర్ లో కూర్చున్నాడు.

ఎలా? ఏవిధంగా?

అతని మనసు ఊహించలేనంత వేగంగా పరిపరివిధాలపరిగెడుతున్నది సమస్యలు పరిష్కరించేందుకు సవ్యమార్గాన్నే తొక్కాలని ఎక్కడవుంది? సవ్యానికి ఎంత విలువ వుందో అపసవ్యానికీ అంతే వుంది. ఒక్కొక్కప్పుడు మంచితనం సాధించలేని పన్ల చెడ్డతనమే సాధింపజేస్తుంది.

అతని మనసులో చెలరేగుతున్న భావాలు ముఖంలో ఎప్పటికప్పుడు స్పష్టంగా వ్యక్తం అవుతున్నాయి. ఆ భావాల తాలూకు స్వరూపాల ఛాయలుకూడా అతని ముఖంలో క్షణక్షణం మారిపోతున్నాయి కొంతసేపు గడిచాక వున్నట్లుండి...చివరికి - అతనికళ్ళలో కాంతీ, పెదవులమీద హాసం గోచరించాయి తెరలు తెరలుగా మారిపోతున్న అతని భావపరంపర ఒకచోట చిరస్థాయిగా నిలచిపోయింది ఒకసారి హాయిగా వూపిరి పీల్చుకున్నాడు. అతనికి ప్రయాణ బడలిక ఇప్పుడు గుర్తుకు వచ్చింది., యింతసేపు గడిచాక తరువాత నెమ్మదిగా వెనక్కివాలి నిశ్చింతగా కళ్ళుమూసుకున్నాడు.

* * *

ఆసాయంత్రం చంద్రం అంటున్నాడు భార్యతో "మామయ్య ఎందుకొచ్చినట్లు?"

"నాకుమట్టుకు ఏం తెలుసు?"

"నిన్న నే నడగటం లేదు. ఊరికినే మనకులో వున్నది బయటకు అనేశాను. సాధారణంగా ఆయన పనిలేకుండా రాడే అని?" చంద్రం ఆలోచిస్తూ సందిగ్ధంగా అన్నాడు.

ఒక క్షణంసేపు ఆలోచించాక ఆమె తెలివిగానే జవాబిచ్చింది "ఒకటయి వుంటుంది. మీ అమ్మగారేమయినా రమ్మని రాశారేమో?"

"ఎందుకు రాసివుంటుందంటావు?"

"బాగానే వుంది. ఆమాత్రం ఆలోచించటం చాతకాకపాయె మనిషికి మీఅన్నదమ్ముల తగువు తీర్చటానికేమో" పుల్లవిరుపుగా అంది ఆమె

"అయితే కావచ్చు" అనుకున్నాడు చంద్రం.

గుమ్మందగ్గర అడుగులచప్పుడు వినిపించింది. చంద్రం చప్పున తలయెత్తి "ఓ! రా మామయ్యా" అని కుర్చీ చూపించాడు. గంగాధరం స్వల్పంగా నవ్వుతూవచ్చి కూర్చున్నాడు. ఆమె! చంద్రం భార్య కొంచం ప్రక్కకు తొలిగి నిల్చుంది.

'ఇందాకనగా వస్తే యిప్పుడు రావటానికి తీరికయిందా మాయింటికి?" చంద్రం అడిగాడు నిర్వికారంగా

"అదికాదు లేరా..." అనేసి "కులాసాగా వున్నావమ్మా" అనడిగాడు చంద్రం భార్యవంక తిరిగి.

ఆమె క్లుప్తంగా 'ఊ' అంది.

"అయితే ఏమున్నా పని మీదనా?" చంద్రం అడిగాడు

"ఊ అంతే లేకపోతే సరదాగా రావటానికి నాకెక్కడ తీరుతుంది?" ఆపనేమిటో చంద్రం అడగలేదు; అడిగినా గంగాధరం చెప్పలేకపోడు.

తను అక్కడ వుండటం అనుచితం కాదు అని అనుకోకపోయినా, అనవసరం అనుకుని చంద్రం భార్య లోపలకు వెళ్ళిపోయింది

గంగాధరం సుఖంగా కూర్చుంటూ "పని మీదనే అనుకో ఈ ఊరికి రావటం పొరపాటయింది అసహ్యమైన విషయాలు చాలా వినాల్సివచ్చింది" అన్నాడు.

"ఎవర్ని గురించి మామయ్యా?" అన్నాడు చంద్రం కుతూహలంగా

"ఎవర్ని గురించో వింటే నీతో చెప్పటమెందుకు?"

"అయితే నాగురించే అన్నమాట."

గంగాధరం తలవూపాడు.

"ఎవరు చెప్పారు?"

"ఎవరో అయితే నేను బాధపడటం, నీతో యీ విషయం ప్రస్తావించటం ఎందుకు సంభవించేది?"

"ఇంకేం? అన్నయ్యే చెప్పివుంటాడు."

గంగాధరం తలవూపాడు.

చంద్రానికి అరికాలిమంట నెత్తికెక్కింది. "ఏమిటి? ఏం చెప్పాడు?" అన్నాడు బొంగురుగొంతుతో.

"చేయవలిసిందేదో చేయనే చేశావుగా మళ్ళీ నానోట వినటానికి అంత కుతూహలపడతా వెందుకు?"

"ఏమయినా కానీ. నువ్వు చెప్పాల్సిందే మామయ్యా"

వెంటనే చెప్పటానికి సాహసించలేకపోయాడు గంగాధరం. తరువాత...గొంతు సర్దుకుని ... "అదికాదురా. మీ నాన్న పోతూపోతూ మీయిద్దర్నీ విడిపోకుండా, కలసి మెలసి వుండమని ప్రాధేయపడి పోయాడుగదా నువ్వు అదంతా మరిచిపోయి అప్పుడే నీభాగంకోసం ప్రాకులాడుతున్నావటగా."

"అన్నయ్య చెప్పాడా?"

"ఇంకా వినవోయి 'వద్దురా యిది మంచిపనికాదు. నాన్న ఆత్మకు కష్టం కలుగుతుంది' అని అన్నయ్య చెప్పాడుట. నువ్వువింటేనా? ససేమిరా అని మొండికేసేవాపుట. నిజమేనా?"

"ఏమిటి? వాడు తప్పంతా నామీదే రుద్ది చెప్పాడన్నమాట. అంతేనా? ఇంకా ఏమయినా..?" అంటూ చంద్రం కోపంతో ఆగిపోయాడు

"చెప్పేందుకు చాలా చెప్పాడు. అయినా అవన్నీ నా నోటివెంట రాలేవు"

"అయితే వాడు చెప్పింది నమ్మావా మామయ్యా?"

గంగాధరం మెల్లగా నవ్వాడు "ఉన్న విషయం చెబుతున్నాను విను వాడు నీమీద యింత కాదుగదా, యింకా ఎంత కల్పించి చెప్పినా నమ్మను వాడి మాటలన్నీ అబద్ధాలని నాకెప్పుడో తెలుసు. అయినా నిన్ను పరీక్ష చేయటానికి అలా అనాల్సివచ్చింది"

"అయితే నే నిప్పుడేం చేయాలంటావు?"

"అది నే నేం చెప్పను? నీయిష్టం మెదలకుండా వూరుకున్నా వూరుకోవచ్చు. 'ఏమిట్రా మామయ్యతో యిలా అన్నావుట?' అని అడిగినా అడగవచ్చు సరే నాకు రైలు టైము అయిపోయింది వెళ్ళిపోతాను." అంటూ గంగాధరం లేచాడు, సంచీతో సహా.

"అదేమిటి మామయ్యా? అప్పుడే?"

"పోవాలి. అక్కడ చాలా అర్జంటు పన్లున్నాయి"

చంద్రం ఎంతచెప్పినా అతను వినిపించుకోలేదు "వస్తానమ్మాయి" అని బయట నుంచే కేకేసి గేటు దాటి - స్టేషన్కి - శంకరం ఆఫీసువైపుగా వెళ్ళిపోయాడు.

ఆయన చెప్పినవన్నీ చంద్రం భార్యతో పూసగుచ్చినట్లు చెప్పాక "ఏంచేయమంటావు?" అని సలహా అడిగాడు

"ఇంకా ఏంచెయ్యనా అని ఆలోచిస్తున్నారా? యింటికిరాగానే 'ఏమిటిలా అన్నావుట?' అని మొహాన అడిగేయండి."


## నారసింహ లేహ్యము




బంగారు చేర్చబడినది. మేహము, నికొక్క, నిస్సత్తువ, శుక్లనష్టమును హరించి బలమును, కాంతిని, వీర్యవృద్ధిని కలిగించు వరప్రసాదము—

20 తు॥ డబ్బి రు. 3-4-0 పోస్టేజి 15 అ.

కె. సి. ఏ. & కంపెనీ. "ఆయుర్వేదసమాజం"

పెరిదేపి- నెల్లూరు జిల్లా.

"అంతేలే" అన్నాడతను.

ఒక అరగంట గడిచాక శంకరం గేటు దాటి లోపలకి వస్తున్నాడు అతను మెట్లు ఎక్కేటంతలో చంద్రం దూసుకువచ్చి "ఆగు అన్నయ్యా" అన్నాడు.

శంకరం చురచురచూసి "నన్ను ఆగమనేందుకు నువ్వెవరివి?" అన్నాడు

"నేనెవర్నో నీకు తెలుసు. అదలావుంచి నిన్నో విషయం అడగాలి నేను"

"నేనూ అడగాలి"

ఆసమాధానాలు వింటుంటే చంద్రానికి అరికాలిమంట నెత్తికెక్కింది "నువ్వు అడిగేది తర్వాత అడుగుదువుగాని ముందు నా ప్రశ్నకి సమాధానంచెప్పు. మామయ్యతో ఏమిటి అన్నావుట?"

"నువ్వేమిటి అన్నావుట?"

"అదేగో తర్వాత చెబుతాకాని ముందు నువ్వు చెప్పు. నాగురించి లేనిపోనివి కల్పించి చెప్పావా లేదా?"

శంకరం కోపంతో మండిపడుతూ "ఏమీ తెలియనట్లు నంగనాచిలా మాట్లాడతావేం? ఆయన్తో అంతా చెప్పింది నువ్వేగా" అన్నాడు

"నేనా?" అని విస్తుపోయాడు చంద్రం.

"లేకపోతే నేననుకున్నావా?"

చంద్రం యీసారి వెంటనే మాట దులిపెయ్యకుండా ఆలోచనకు తావిచ్చాడు ఒకనిమిషం గడిచాక "ఏమని చెప్పాడు?" అని అడిగాడు.

"నేనే ఆస్తి విడదీద్దామని ప్రయత్నాలు చేశానట ఆవంకా యీ వంకా పెట్టి ఎక్కువభాగం పంచుకోవాలని చూస్తున్నానుట నువ్వువద్దురా అనిప్రాధేయపడినా వినలేదుట ఇవన్నీ నువ్వేగా ఆయనకు చెప్పింది?" అన్నాడు శంకరం.

చంద్రం దిగ్భ్రాంతుడై "ఇదేమిటి? మామయ్య యిలా ఎందుకుచేశాడు?" అని అనగలిగాడు.

"ఏమిటి?"

"ఆ మాటలన్నీ నువ్వు చెప్పావని నాకు కూడా చెప్పాడు"

"అదేమిటి?"

"చెబుతాను. నీకిదంతా చెప్పింది ఎప్పుడు?"

"ఇంతకుముందే ఊరికి పోతూ పోతూ చెప్పాడు."

"అయితే నా దగ్గరనుంచి వస్తూ నీకు కూడా చెప్పిపోయాడన్నమాట."

"ఇలా ఎందుకు జరిగిందంటావు?" అన్నాడు శంకరం సాలోచనగా - సానునయంగా.

"అదే నేనూ ఆలోచిస్తున్నాను."

"అదే నేనూ ఆలోచిస్తున్నాను."

అయిదునిమిషాలవరకూ ఎవరూ మాట్లాడలేదు. తీవ్రంగా ఆలోచిస్తూ వుండిపోయారు. ఉన్నట్లుండి శంకరం ముఖంలోకి వింతకాంతి ప్రవేశించింది. అతనికళ్లు ఏదో రహస్యాన్ని పసిగట్టినట్లు ప్రకాశించాయి.

"తెలిసింది తెలిసింది,"

"ఏమిటి?" చంద్రం ఆత్రుతతో అడిగాడు

"మనంయిద్దరం చిన్నవాళ్ళం అమాయకులం ఏదో తగాదావచ్చి విడిపోయాం. మామయ్య మనయిద్దరి అశక్తతనూ గ్రహించాడు గ్రహించి యింకా దూరం చెయ్యాలని యీ నాటకం ఆడాడు."

చంద్రం కొంచం ఆలోచిస్తూ "ఇలా చేసినందువల్ల ఆయనకు ప్రయోజనమేమిటంటావు?" అని ప్రశ్నించాడు.

"అది తెలుసుకునేటంతటి తెలివితేటలుకూడా మనకు లేవు. వాళ్ళు పెద్దవాళ్లు మన విరోధాలమధ్య వాళ్ల అవసరాలు ఎన్నో సాధించుకుంటారు. అంతే" అన్నాడు శంకరం.

"అంతే అయివుంటుంది"

"దీనికి ఒక టేమందు"

"ఏమిటి?"

"మనం యిన్నాళ్లనుంచి ఎంత పొరపాటు చేశామో అర్థమయిందా?" అన్నాడు శంకరం గాద్గదికంగా.

"ఊఁ" అని మూలిగాడు చంద్రం.

"అంతే. ఇవాల్టినుంచీ యీ తడికకు స్వస్తి"

"మామయ్య ఎంత మోసం చేయబోయాడు? ఈ తడిక నిప్పులో కీ వేద్దాం" అన్నాడు చంద్రం

లోపలనుంచి వస్తూ యీ చివరి రెండు మాటలూ విన్న రాజమ్మ అప్రయత్నంగా కళ్లు తుడుచుకుంది. ★


# విచిత్రవ్యక్తి

మూలం:

మార్క్ ట్వేన్

అనువాదం:

నండూరి రామమోహనరావు

వెల రూ. 1-8-0

పోస్టు ఖర్చులు ప్రత్యేకం

ఆంధ్రగ్రంథమాల, మద్రాసు-1.


# రచయితలకు మనవి

**మాకు కథలు, గేయాలు, చిత్రాలు, ఫొటోలు పంపేవారు ఈ క్రింది అంశాలను గమనించ ప్రార్థన.**

ప్రచురించని వానిని త్రిప్పిపంపగోరే వారు బుక్ పోస్టుకు అవసరమైన స్టాంపులను, రచనలూ, చిత్రాలూ, ఫోటోలతోనే చేర్చిపంపాలి

బుక్ పోస్టుకు అణా స్టాంపుకు తక్కువ కాకుండా పంపాలి.

రచనలను కాయితానికి ఒకే వైపున సిరాతో వ్రాసిపంపాలి

ఫొటోలు కనీసం కార్డు సైజులో వుండాలి నెగటివ్ లు స్వీకరించబడవు

చిత్రాలు ఇండియన్ ఇంకుతో వేసిపంపాలి రంగుల చిత్రాలు స్వీకరించబడవు.

ప్రచురణ విషయాన్ని వెంటనే తెలియచెయ్యడం కష్టం

నిరాకరించబడిన రచనలను త్రిప్పి పంపడానికి మాకు కనీసం ఒక మాసమైనా వ్యవధి అవసరం ఫొటోలు, చిత్రాల విషయంలో యింకా ఎక్కువ వ్యవధి కావలసివుంటుంది

ప్రచురించే వానిని గురించి ప్రచురించే ముందు మాత్రమే తెలియపరచగలము.

మాకు పంపిన రచనలను, ఫొటోలను, చిత్రాలను గురించి మా కార్యాలయంనుంచి ఎవ్విధమైన సమాచారమూ అందనిదే, వాటి ప్రతులను యితర పత్రికలకు పంపవద్దని ప్రార్థన

రచయితలూ, చిత్రకారులూ, సహృదయంతో సహకరించగలరని విశ్వసిస్తున్నాము.

—సంపాదకుడు.